

కార్తీక పౌర్ణమి పూజలు

జిల్లాలోని శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేశారు.



చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శోభ



కల్లూరు చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం ముందు చంద్రుడి సమక్షంలో వెలుగుతున్న కార్తీకదీపం



సంతపేట కనకదుర్గ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం



చిత్తూరులోని అగస్త్యేశ్వరాలయం వద్ద కార్తీక దీపంతో యువతి






గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో శివునికి పూజలు, దీపారాధన చేస్తున్న భక్తులు

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా యాదమరి మండలంలో 30 మి.మీ, పూతలపట్టులో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. గంగవరంలో 24.6, పలమనేరులో 22, చిత్తూరులో 14.6, గుడిపాలలో 14, బైరెడ్డిపల్లెలో 12.4, బంగారుపాళ్యంలో 10.6, విజయపురంలో 9.4, నగరి, పాలసముద్రంలో 9.2, పులిచెర్లలో 8.8, నింద్రలో 8.2, చిత్తూరు రూరల్‌లో 7.2, రొంపిచెర్లలో 6.8, పుంగనూరులో 5.2, రామకుప్పంలో 4.8, సదుం, గుడుపల్లెలో 4.2, శాంతిపురంలో 3.6, సోమల, వి.కోటలో 3, పెద్దపంజాణిలో 2.8, కుప్పంలో 2.6, చౌడేపల్లెలో 2మి.మీ వర్షపాతం నమోదైంది.

డిసెంబరులో చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబరులో సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. టీడీపీ వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. డిసెంబరు 12, 13, 14, 15 తేదీల ఏవో రెండు తేదీలను ఎంచుకుని కుప్పంలో రెండ్రోజుల పర్యటన చేయనున్నారు. ఈమేరకు స్థానిక పార్టీ వర్గాలకు సమాచారమందింది. అయితే సీఎంగా బీజీ షెడ్యూల్ ఉండడంవల్ల కచ్చితమైన పర్యటన తేదీలను తర్వాత ప్రకటించనున్నారు. అదే సమయంలో సీఎం సతీమణి నారా భువనేశ్వరి ఈనెల



25, 26, 27, 28 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించనున్నారని కూడా పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈమె పర్యటన సైతం ఇంకా నిర్ధారణ కాలేదు. డిసెంబరులో ముఖ్యమంత్రే స్వయంగా కుప్పం పర్యటన చేయనున్న నేపథ్యంలో దానికి కేవలం పదిహేను ఇరవై రోజుల ముందు భువనేశ్వరి పర్యటన పెట్టుకుంటారా అన్నది సంశయంగా మారింది. మొత్తంమీద ఈనెలతోపాటు డిసెంబరులో ముఖ్యమంత్రి, ఆయన సతీమణి.. ఎవరో ఒకరు కానీ, లేదా ఇద్దరూ కానీ కుప్పం పర్యటన చేసే అవకాశం మాత్రం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

'సివిల్స్' పరీక్షలకు ఉచిత శిక్షణ

చిత్తూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాష ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఈనెల 24వ తేదీలోపు జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ, అంబేడ్కర్ భవన్, కలెక్టరేట్‌లో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. ఎంపికైన వారికి 27వతేదీన స్ర్కీనింగ్ టెస్టు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ఆధారంగా విజయవాడలోని గొల్లపూడిలో ఆంధ్రప్రదేశ్, స్టడీ సర్కిల్, బీసీ భవన్‌లో శిక్షణ ఇస్తామన్నారు. బీసీలను 66శాతం, ఎస్సీలను 20శాతం, ఎస్టీలను 14 శాతం ప్రాతిపదికన ఎంపిక చేస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 91774 29494 నెంబరులో సంప్రదించాలని కోరారు.

చిత్తూరుకు నీటి కేటాయింపు పై కూటమి శ్రేణుల సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి.. మాట్లాడుతున్న నేతలు

చిత్తూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగరానికి 0.785 టీఎంసీల నీటిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కూటమి పార్టీల శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం చిత్తూరులోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నేతలు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేయడంతో ఐదేళ్లు పనులు ఆగిపోయాయని చెప్పారు. ఎమ్మెల్యే జగన్మోహన్ చొరవతో ఓ వైపు ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతుండగా.. మరోవైపు చిత్తూరుకు నీటి కేటాయింపులు జరగడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు చంద్రప్రకాష్, బాలాజి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, జనసేన నేత దయారాం, నేతలు మోహన్‌రాజ్, రాజశేఖర్, కంద, ఆర్ఎస్ నాయుడు, శేషాద్రి, ఆనంద్ పాల్గొన్నారు.



కిడ్నాపర్ల కారులో మాజీ సర్పంచు, కుటుంబీకులు

రివాల్వర్ చూపి, ఇన్‌కం ట్యాక్స్ అని చెప్పి..

రామకుప్పంలో కిడ్నాప్ కలకలం

మాజీ సర్పంచు, కుటుంబీకులను 4 వాహనాల్లో తరలింపునకు యత్నం

పోలీసులను చూసి పరారైన దుండగులు

రామకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఓ మాజీ సర్పంచు, ఆమె కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రామకుప్పం మండలం పెద్దకురబలపల్లెకు చెందిన మాజీ సర్పంచు మాధవి ఇంటి వద్దకు పది మంది గుర్తుతెలియని వ్యక్తులు గురువారం 11గంటల ప్రాంతంలో వచ్చారు. ఇంటి తలుపులు తట్టడంతో మాజీ సర్పంచు భర్త గోవిందప్ప బయటకు వచ్చారు. ఆయన వచ్చీ రాగానే రివాల్వర్



కిడ్నాపర్లు


చూపుతూ.. తాము ఇన్‌కం ట్యాక్స్ అధికారులమని, తిరుపతి నుంచి వచ్చామన్నారు. మీ కుటుంబానికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని, విచారణకు రావాలని కోరారు. వచ్చినవారిపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మాధవి, గోవిందప్ప దంపతులతోపాటు వారి కుమారుడు పునీత్‌కుమార్, మామ సిద్ధప్ప, అత్త గంగమ్మ, పెద్దఅత్త సుబ్బమ్మ, మరిది జయరాం, అతడి కుమారుడు సోమశేఖర్‌లను ఇంటి బయటకు తీసుకొచ్చి.. చంపేస్తామంటూ బెదిరించి నాలుగు వాహనాల్లో ఎక్కించుకుని బయల్దేరారు. అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ఈ వాహనాలు రామకుప్పం పట్టణ శివార్లలోని బందార్లపల్లెక్రాస్‌కు చేరుకున్నాయి. ఆ సమయంలో రామకుప్పం పోలీసులు అక్కడ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసిన దుండగులు.. వాహనాలు ఆపి మాధవి, ఆమె కుటుంబీకులను దింపేశారు. గమనించిన పోలీసులొచ్చి ఏం జరిగిందని బాధితులను విచారిస్తుండగానే దుండగులు తమ వాహనాలతో అక్కడినుంచి పరారయ్యారు. కాగా, ఈ కిడ్నాప్ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. పోలీసుల విచారణ పూర్తయ్యాకే నిజానిజాలు తెలియనున్నాయి.

నేడు ప్రపంచ వేసెక్టమీ దినోత్సవం

జిల్లాలో కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్లు చేయించుకోవడంలో మహిళలకంటే పురుషులు చాలా వెనుకబడి ఉన్నారు. కు.ని కోసం మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్, పురుషుడికైతే వేసెక్టమీ ఆపరేషన్ చేస్తారు. ఇందులో ట్యూబెక్టమీ ఆపరేషన్లే ఎక్కువగా జరుగుతున్నాయి. ఆపరేషన్ అంటే మగాళ్లు భయపడుతున్నారా? లేదా అది మహిళలకే అన్నట్టుగా మిన్నకుండి పోతున్నారో? తెలియడం లేదు. శనివారం వేసెక్టమీ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

మగాళ్లకు భయమా...?



- నాలుగేళ్లలో 27,436 మంది మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు
- ఇదే కాలంలో 'వేసెక్టమీ' చేసుకుంది ముగ్గురు పురుషులే..!

జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లలో 27439 కు.ని ఆపరేషన్లు జరిగాయి. అందులో మహిళలు 27,436 మంది ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటే, పురుషులు మాత్రం ముగ్గురంటే ముగ్గురు వేసెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ ఆపరేషన్ చేయించుకుంటున్న మగవారి సంఖ్య ఒక్కో ఏడాది అసలు ఉండటం లేదు.

పురుషులకే సులువు

కు.ని ఆపరేషన్ మహిళల కంటే పురుషులకే సులువని వైద్యులు చెబుతున్నారు. పురుషులకు ఎలాంటి కడుపు కోత లేకుండా 5 నుంచి 10 నిమిషాల్లో అయిపోతుంది. ఆపరేషన్ అయిన వెంటనే వారు ఇంటికి, పనులకు యథావిధిగా వెళ్లొచ్చని అంటున్నారు. వీర్యం ప్రయాణించే చిన్న వాహికకు గాటు పెట్టి.. అక్కడే మూసివేస్తారు. ఒకసారి ఈ ఆపరేషన్ పూర్తయ్యాక మళ్లీ కావాలనుకుంటే దీన్ని తెరిచే అవకాశాలు కూడా ఉన్నాయి.అదే మహిళలకు కు.ని. ఆపరేషన్ పూర్తయ్యాక నెల రోజుల పాటు జాగ్రతతో కూడిన విశ్రాంతి తీసుకోవాలి. కొన్ని నెలలపాటు బరువులు ఎత్తకూడదు. ఆపరేషన్ జరిగిన పొట్ట భాగంలో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదమూ లేకపోలేదు.

ప్రోత్సాహకం రూ.1,100

వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం రూ.1,100 ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఈ ఆపరేషన్‌ని ప్రోత్సహించి ఆస్పత్రికి తీసుకొచ్చిన వారికి కూడా రూ.250 చెల్లిస్తారు. వేసెక్టమీ చేసిన వైద్యుడికి రూ.150 ఇస్తారు. అదే ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునే మహిళలకు రూ.850, ప్రోత్సహించి తీసుకొచ్చినవారికి రూ.150 చెల్లిస్తారు.

జిల్లాలో కు.ని ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	మహిళలు (ట్యూబెక్టమీ)	పురుషులు (వేసెక్టమీ)
2021-22	6,747	0
2022-23	7,791	2
2023-24	7,962	0
2024 (నవంబరు 15)	4,942	1
మొత్తం	27,436	3

అపోహలు తొలగించడానికి కృషి



వేసెక్టమీ ఆపరేషన్‌పై ఉన్న అపోహలను తొలగించడానికి కృషి చేస్తున్నాం. ప్రధానంగా వైవాహిక జీవితంలో ఇబ్బందులు వస్తాయన్న అపోహ పురుషుల్లో బలంగా నాటుకుపోయింది. ఇది నిజం కాదని.. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నాం.

- ప్రభావతీదేవి, డీఎంహెచ్‌వో

అందరిలోనూ చైతన్యం రావాలి



వేసెక్టమీ ఆపరేషన్‌పై అందరిలోనూ చైతన్యం రావాలి. 'ట్యూబెక్టమీ' కంటే.. వేసెక్టమీ ఆపరేషన్ చాలా సులభం. ఆపరేషన్ చేయించుకున్నాక పురుషుల్లో లైంగిక సామర్థ్యం తగ్గుతుందన్నది అపోహ మాత్రమే.

- ప్రభావతి, డీసీహెచ్ఎస్



కపిలతీర్థంలో
వేడుకగా అన్నాభిషేకం

తిరుపతిలోని కపిలతీర్థంలో శుక్రవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేశారు. ఈ ఉపచారాలన్నీ అర్చకస్వాములే ఏకాంతంగా నిర్వహించడం విశేషం. భక్తులు ఎవరికీ ప్రవేశంలేదు. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య భక్తులకు అన్నలింగదర్శనం కల్పించారు. రాత్రి 8 గంటల తర్వాత పుష్కరిణిలో అన్నవిగ్రహాలకు పూజలు నిర్వహించారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

అన్నాలంకారంలో వాల్మీకేశ్వరుడు

నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ పరివార దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాదికార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మూలమూర్తి వాల్మీకేశ్వరస్వామిని దాతలు అందించిన అన్నంతో అలంకరించి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారి సన్నిధిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అభిషేకించిన కొంత అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. అనంతరం అరుణా నదిలో అన్నాన్ని నిమజ్జనం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి





కపిలతీర్థంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తిరుపతి నరసింహతీర్థం రోడ్డులోని శివాలయం వద్ద..



కపిలతీర్థం జలపాతం వద్ద సందడి

సందడిగా కపిలతీర్థం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కపిలతీర్థం సందడిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. కపిలతీర్థం కూడలి వద్ద పోలీసులు భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహనాలు ఆపుతూ రోడ్డు దాటించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్టాండు నుంచి వచ్చే వాహనాలను ప్రకాశం పార్కు నుంచి రుయాస్పత్రి మీదుగా దారి మళ్లించారు. సాయంత్రం ఇక్కడితో పాటు శివాలయాల్లో కార్తీక దీపాలు వెలగించారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి



పుష్కరిణిలో భక్తుల సెల్ఫీ



కార్తీకదీపం వెలిగిస్తూ..

యోగుల కొండపై..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వడమాలపేట మండలం యోగుల కొండపై కొప్పెర దీపాన్ని వెలిగించారు. 1503 కిలోల నెయ్యితో, ఆరు అడుగుల కొప్పెర దీపాన్ని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి వెలిగించారు. దీప దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి





తిరుమలలో కార్తీక దీప వెలుగులు

తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంతం శుక్రవారం కార్తీక దీప వెలుగులను సంతరించుకుంది. గరుడ వాహనసేవను కూడా నిర్వహించిన క్రమంలో తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అఖిలాండం వద్ద నేతి దీపాలను వెలిగించి పూజలు చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నాయుడుపేట వద్ద స్వర్ణముఖినది వద్ద..







శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో..., శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

స్వర్ణముఖి నదిలో కార్తీక దీపాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ముక్కంటి ఆలయ రెండో గేటు వద్ద భక్తులు పెద్దసంఖ్యలో నేతి దీపాలను వెలిగించి ముక్కంటికి అర్పించారు. పుణ్య స్వర్ణముఖి నదిలో దీపాలు వెలిగించి గంగాదేవికి సమర్పించారు. ముక్కంటి ఆలయ పరిసరాలు, స్వర్ణముఖినదీ తీరప్రాంతం ఎటు చూసినా నేతి దీపపు కాంతులతో ఆధ్యాత్మిక ప్రకాశించింది. శుక్రవారం సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

22 కిలోల గంజాయి స్వాధీనం
ఇద్దరి అరెస్టు



అలిపిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో శుక్రవారం వేర్వేరుగా చోట్ల 49 కిలోల గంజాయి పట్టుకున్నారు. నగర పరిధిలోని ఆటోనగర్‌లో అలిపిరి పోలీసులు 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. నగర డీఎస్పీ వెంకటనారాయణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం గాజులపల్లికి చెందిన మాదరపు మాధవ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన తోటి సందీప్‌తో కలిసి తిరుపతిలోని అలిపిరి, ఆటోనగర్‌ను కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆటోనగర్ బస్టాప్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా రహస్య సమాచారం మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి వెళ్లి పట్టుకున్నారు. మాధవ నుంచి 12 కిలోలు, సందీప్ నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేశారు. గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నారు? ఎవరు సరఫరా చేస్తున్నారనే వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ చెప్పారు.

నాగలాపురంలో 12 కిలోల పట్టివేత

- ముగ్గురు తమిళనాడువాసులకు రిమాండ్?

నాగలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముగ్గురు తమిళనాడువాసులను రిమాండుకు తరలించినట్లు సమాచారం. శుక్రవారం నాగలాపురం బైపాస్ రోడ్డులో పోలీసులు నిర్వహించిన నాకాబందీలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు తమిళనాడుకి చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరి నుంచి 12 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను సత్యవేడు కోర్టుకి తరలించి రిమాండ్‌కి తరలించినట్లు సమాచారం. దీనిపై పోలీసులు సాయంత్రం 3 గంటలకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అయితే సమావేశం రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితుల వివరాలను తెలుసుకునేందుకు ఎస్ఐ సునీల్‌కుమార్‌ను సంప్రదించగా, ఆయన నిరాకరించారు.





తిరుపతి రైల్వే స్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు, గంజాయి బ్యాగులను స్వాధీనం

రైల్వే స్టేషనులో 15.124 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం/సెంట్రల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలు నిర్వహించిన ఆపరేషన్ నార్కోస్ సక్సెస్ అయింది. స్టేషన్‌లోని లగేజీ కౌంటర్లు, పార్శిల్ కార్యాలయాలు, వివిధ రైళ్లు, ప్లాట్‌ఫారాలపై ఏకకాలంలో తనిఖీలు చేపట్టి రూ.3.78 లక్షల విలువ చేసే 15.124 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి స్టేషన్ నుంచి గంజాయి తరలిపోతుందనే సమాచారంతో జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం, ఎస్ఐలు ధర్మేంద్ర, రాంబాబు, ఏఎస్ఐ మునిరాజ, డాగ్ హ్యాండ్లర్ యానాదిరావు సిబ్బందితో కలసి ఐదారు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. నాలుగో ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ట్రాలీ, కళాశాల బ్యాగుల్లో గంజాయిని ఆర్‌పీఎఫ్‌కు చెందిన జాగిలం వాయు గుర్తించింది. 15.124 కిలోల గంజాయిని సీఆర్‌పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గంజాయి, నిషేధిత వస్తువులు కనిపిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఆశీర్వాదం కోరారు. తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తనిఖీల్లో పాల్గొన్నారు.

'సారా' సామ్రాజ్యం..?
'పోలీసులు, ఎక్సైజ్' దాడి చేస్తున్నా ఆగని తయారీ, విక్రయాలు
కౌన్సెలింగ్ ఇచ్చి, ఉపాధి చూపితేనే చెక్ పెట్టొచ్చు

వెదురుకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎక్సైజ్ పరిధిలో 'సారా సామ్రాజ్యం' విస్తరిస్తూనే ఉంది. పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు వాళ్లు వేర్వేరుగా విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నా.. ప్రయోజనం లేకపోతోంది. తరచూ సారా పట్టుబడుతుండటమే దీనికి నిదర్శనం. ఎక్కువ మంది కుటుంబ పోషణకు ఇందులో దిగినట్లు సమాచారం. వీరందరినీ గుర్తించి.. సారా తయారీ, అమ్మకాల వల్ల చట్టపరంగా ఎదుర్కొనే ఇబ్బందులపై కౌన్సెలింగ్ ఇవ్వాలి. అలాగే బ్యాంకులు లేదా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆయా కుటుంబాలకు రుణాలిప్పించి.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఉపాధి చూపితే 'సారా' తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి.

అయ్యవారికండ్రిగదే పైచేయి..

తమిళనాడుకు సరిహద్దు ప్రాంతమైన పాలసముద్రం మండలంలోని అయ్యవారికండ్రిగదే సారా తయారీ, విక్రయాలు, రవాణాలో పైచేయిగా ఉంది. ఈ ప్రాంతం పక్కన అటవీ ప్రాంతం ఎక్కువ కావడంతో చాలామంది కుటీర పరిశ్రమగా దీన్ని ఎంచుకున్నారు. ఇక్కడ తయారు చేసిన సారాను ప్యాకెట్ల రూపంలోనూ, 35 లీటర్ల క్యాన్లలోనూ తమిళనాడుకు తరలిస్తారు. అక్కడి వ్యాపారులు 5లీటర్ల క్యాన్లలోకి మార్చుకుని వ్యాపారం చేస్తారని సమాచారం. సారా లీటరు రూ.300-400 వరకు విక్రయిస్తారు.

నాలుగు మండలాల్లో ఇలా..

- పాలసముద్రం మండలంలోని నరసింహాపురం, అయ్యవారికండ్రిగ, తిరుమలరాజుపురం, గంగమాంబాపురం గ్రామ పంచాయతీల్లో సారా రాజ్యమేలుతోంది. అయ్యవారికండ్రిగ, అల్లిపూలగుంటలో సారాకు ప్రసిద్ధిగా చెప్పవచ్చు.
- ఎస్‌ఆర్‌పురం మండలంలో చిన్నతయ్యూరు, పెద్దతయ్యూరు, పుల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పొదలపల్లె, డీకేమర్రిపల్లె తదితర ప్రాంతాల్లోనూ సారా విక్రయాలు, తయారీ కొనసాగుతున్నాయి.
- వెదురుకుప్పం మండలంలో అగ్గిచేనుపల్లె, నక్కలాంపల్లె, పచ్చికాపల్లం, వెదురుకుప్పం, బలిజపల్లె, కురివికుప్పం, కేవీఎం అగ్రహారం, కన్నికాపురం, బ్రాహ్మణపల్లె తదితర ప్రాంతాల్లో సారా విక్రయాలు జరుగుతున్నాయి.
- కార్వేటినగరం మండలంలో ఎర్రమరాజుపల్లె, గాజంకి, గోపిశెట్టిపల్లె, కన్నికాపురం, కొటార్వేడు, అమ్మపల్లె, జాండ్లపేట తదితర ప్రాంతాల్లో సారా అమ్మకాలు ఆగడం లేదు.



2వేల లీటర్ల సారా ఊట ధ్వంసం

శ్రీరంగరాజపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం పొదలపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో సారా స్థావరాలపై కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. రెండువేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. 100 లీటర్ల సారాను, 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఏడుగురిని గతంలో సారా తయారు చేసిన అనుమానితులుగా గుర్తించామని, వారిపైనా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఆర్‌పురం ఎస్ఐ సుమన్, కార్వేటినగరం ఎస్ఐ రాజ్ కుమార్, వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పాలసముద్రం ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 30మంది సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో
కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాచయ్య శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి.. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఎకో టూరిజం ఏమైంది?

● ననియాలలో అటకెక్కిన పర్యాటక కేంద్రం పనులు
● వైసీపీ ప్రభుత్వ అలసత్వంతో ఆగిన నిధులు





పర్యావరణ పర్యాటక కేంద్రం ముఖద్వారం, నిరుపయోగంగా కాటేజీలు

రామకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల అటవీప్రాంతంలో పర్యావరణ పర్యాటక కేంద్రం పనులకు నిధులు ఆగిపోయి ఐదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చేరువలో ఉన్న ననియాల అటవీ ప్రాంతంలో పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా స్థానికులు, అటవీశాఖ అధికారులు ప్రతిపాదిస్తూ వచ్చారు. సుదీర్ఘకాలం తర్వాత 2017 చివరలో అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర అటవీ, పర్యాటక శాఖలు ఇక్కడ పర్యాటక కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. 2018 జనవరి 3న పర్యాటక కేంద్రం పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా పర్యాటకులకు వినోదం, ఆహ్లాదం, అటవిడుపులతోపాటు పర్యావరణం, అటవీ, వన్య ప్రాణుల పరిరక్షణపై అవగాహన కల్పించేలా రూ.3కోట్ల అంచనా వ్యయంతో 100ఎకరాల్లో పర్యాటక కేంద్రం, 20ఎకరాల్లో పర్యావరణ పర్యాటక కేంద్రం ఏర్పాటు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

2019 వరకు శరవేగంగా పనులు

2018 నుంచి 2019 వరకు ననియాల పర్యావరణ పర్యాటక కేంద్రం పనులు శరవేగంగా జరిగాయి. అప్పట్లో అక్కడ అధునాతన కేఫ్టేరియా, కలపతో కొన్ని కాటేజీలు, ఈత కొలను, హెలీప్యాడ్, ఉద్యానవనాలు, జీవత్వం ఉట్టిపడేలా పులి, దుప్పులు, అడవికోళ్ల బొమ్మలను, చిన్నపిల్లల పార్కు నిర్మించారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు సుమారు రూ.1.5కోట్లు ఖర్చుపెట్టారు. అలా పనులు ముందుకు సాగుతున్న తరుణంలో 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కొద్ది నెలలకే ఆపేశారు.



చిన్నపిల్లల పార్కు



పాండ్‌లో మూడు ఉండాల్సిన చోట ప్రస్తుతం ఒకే డాల్ఫిన్ బొమ్మ



హెలీప్యాడ్

అసంపూర్తిగా నిర్మాణాలు

పర్యావరణ పర్యాటక కేంద్రంలో ఐదేళ్లుగా పనులు ఆగిపోయి అసంపూర్తిగా ఉన్నాయి. సాధారణ వసతి గృహాలు, విశ్రాంతి వేదికలు, మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఐదేళ్ల నిర్వహణ లోపం కారణంగా ఇక్కడ ఏర్పాటు చేసిన డాల్ఫిన్ పాండ్‌లోని మూడు డాల్ఫిన్ బొమ్మల్లో రెండు విరిగి పోయాయి. అదేవిధంగా జీవత్వం ఉట్టిపడేలా ఉన్న దుప్పుల బొమ్మలు కూడా విరిగిపోయి మూలన పడ్డాయి. పసుపురంగుతో ఉన్న పెద్దపులి బొమ్మ కూడా రంగు వెలిసిపోయి నల్లపులిగా మారిపోయింది.

ఇంకా చేట్టాల్సినవి

అసంపూర్తిగా ఉన్న పనులే కాకుండా పర్యాటక కేంద్రంలో కన్వెన్షన్ హాలు నిర్మాణం పునాదుల తవ్వకంకే పరిమితమైంది. కాటేజీల నుంచి సమీపంలోని కొలనుకు రోప్‌వే, పర్యాటక కేంద్రం చేరువలో జూ ఏర్పాటు చేయాల్సి ఉంది. అదేవిధంగా ఇక్కడి శిక్షణ పొందిన ఏనుగులపై అంబారీలు ఏర్పాటు చేసి, పర్యాటకులను వాటిపై విహరించేలా చూడాల్సిన అవసరం ఉంది.

వారంతంలో పర్యాటకుల తాకిడి

సెలవు దినాలు, వారాంతాల్లో ననియాల పర్యావరణ పర్యాటక కేంద్రానికి సందర్శకులు చెప్పుకోదగ్గ సంఖ్యలో వస్తుంటారు. పర్యాటక కేంద్రం పనులు పూర్తయితే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఇక్కడి కేఫ్టేరియా నిరుపయోగంగా ఉండటంతో నిర్మాణం పూర్తయిన అధునాతన కాటేజీలు సైతం అలంకారప్రాయంగా మారాయి. పర్యాటకుల నుంచి వసూలయ్యే ప్రవేశరుసుం ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో పర్యావరణ కేంద్రంలోని ఉద్యానవనాల నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుత పాలకులు సత్వరం స్పందించి ననియాలలోని పర్యాటక కేంద్రం పనులను పునఃప్రారంభించి, పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తే రామకుప్పం మండలం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రజలు కోరుతున్నారు.



ఈత కొలను





నల్లగా మారిన పెద్దపులి బొమ్మ, అసంపూర్తిగా ఉన్న భవనాలు

భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం

మణికంఠేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, దీపారాధన



జ్వాలాతోరణం నిర్వహిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో శుక్రవారం లక్ష బిల్వార్చన, దీపారాధనను వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు ప్రధాన ఆలయం నుంచి భక్తి శ్రద్ధలతో పూజాద్రవ్యాలను మణికంఠేశ్వర స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉదయం మణికంఠేశ్వర ఆలయంలో స్వామివారికి ఘనంగా రుద్రాభిషేకం జరిగింది. సాయంత్రం ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా లక్ష దీపారాధన చేశారు. అనంతరం ఆలయాన్ని సహస్ర దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వాలా తోరణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



దీపాలను వెలిగిస్తున్న అధికారులు, సిబ్బంది

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ



వరదరాజస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో శుక్రవారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతాన్ని నిర్వహింపచేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



గరుడవాహనంపై స్వామివారు

19న సీడాప్ జాబ్ కనెక్ట్ కార్యక్రమం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీసీలో సీడాప్ జాబ్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీడీ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాసై 19-35 ఏళ్లలోపు వయసుగల వారికి ఉద్యోగాల కోసం ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి సహకారంతో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99635 61755, 94418 72140 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మూడేళ్లుగా డబ్బులు ఇవ్వలేదు

- డిప్యూటీ కలెక్టర్‌కు బీఎల్వోల మొర



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటశివ

గంగాధరనెల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా కోసం చేసిన పనికి మూడేళ్లుగా డబ్బులు ఇవ్వలేదని డిప్యూటీ కలెక్టర్ వెంకటశివకు పలువురు బీఎల్వోలు మొరపెట్టుకున్నారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శుక్రవారం సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో డిప్యూటీ కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా తమ సమస్యను బీఎల్వోలు ప్రస్తావించగా, త్వరలోనే నిధులను విడుదల చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జనవరి నుంచి లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవాలి

● ఖజానాశాఖ డీడీ రామచంద్ర

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్ల నుంచి లైఫ్ సర్టిఫికెట్లు 2025 జనవరి నుంచి ఫిబ్రవరి నెలలో మాత్రమే స్వీకరించాలని ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో నవంబరు నుంచి ప్రభుత్వ పెన్షనర్ల వద్ద లైఫ్‌సర్టిఫికెట్లు స్వీకరించేవారని గుర్తుచేశారు. ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల మేరకు నవంబరు, డిసెంబరు నెలల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవద్దని అధికారులకు సూచించారు.


డీఎస్పీ కార్యాలయంలో సంతకాలు చేసిన మిథున్‌రెడ్డి



పలమనేరు డీఎస్పీ కార్యాలయం నుంచి వెలుపలకు వస్తున్న మిథున్‌రెడ్డి

పలమనేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సంతకాలు చేశారు. పుంగనూరులో జరిగిన కేసుకు సంబంధించి ఆయన కోర్టు నుంచి పొందిన కండీషన్ బెయిల్ మేరకు ఇక్కడికొచ్చి సంతకాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైసీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం: ఎస్ఈ



ప్రసంగిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన డివిజన్ అధికారులతో సమీక్షించారు. ప్రతినెలా వంద శాతం బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం, మరమ్మతులను 48 గంటల్లో పూర్తిచేసి రైతులకు అందించాలని చెప్పారు. అలాగే స్థానిక గిరింపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ తనిఖీ చేశారు. ఈఈ మునిచంద్ర, డీఈలు ఆనంద్, సుబ్రహ్మణ్యం ప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

వరసిద్ధుడికి అన్నాభిషేకం



ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి శుక్రవారం అన్నాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన దివంగత సల్లా సుబ్బరాయులు శెట్టి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక.. స్వామివారిని పూర్తిగా అన్నంతోకప్పి వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ప్రధాన ఆలయాన్ని వివిధరకాల పుష్పాలు, అరటి బోదెలు, మామిడి తోరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతి ఏడాది ఆశ్వీజ నెలలో వచ్చే పౌర్ణమి రోజున ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అన్నాలంకృతుడైన వరసిద్ధుడిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం విచ్చేశారు.



చిలుక వాహనంపై సిద్ధి, బుద్ధిసమేత వరసిద్ధుడు

గ్రామోత్సవం

అన్నాభిషేకాన్ని పురస్కరించుకుని రాత్రి సిద్ధి, బుద్ధిసమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను చిలువ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటుండెంట్లు కోదండపాణి, వాసు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

శునకాల బెడదకు చెక్..!

● జిల్లాలో ఏబీసీ సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ ఆమోదం



శునక షెడ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న పశుసంవర్ధక జేడీ ప్రభాకర్, మున్సిపల్ అధికారులు

చిత్తూరు (సెంట్రల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శునకాల బెడదకు చెక్ పెట్టే దిశగా జిల్లా పశుసంవర్ధక, మున్సిపల్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కుక్కల దాడిలో గాయపడి.. రేబిస్ వ్యాధి సోకేవారి సంఖ్య రోజురోజుకూ పెరగడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లా కేంద్రంలోనే ఏడు వేలకుపైగా శునకాలు ఉన్నట్లు గుర్తించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు నివేదికను కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సమర్పించారు. అలాగే జిల్లా విభజన తర్వాత యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ ఏర్పాటుకు వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఏబీసీని జిల్లా కేంద్రంలో ఏర్పాటుపై కలెక్టర్ ఆమోదం తెలిపి.. రూ.5లక్షలు మంజూరు చేయగా, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.11 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ మొత్తం నిధులతో ఎన్టీఆర్ బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి ప్రాంతంలో శునకాలకు గదులు, వాటి సంతతి నివారణకు ఆపరేషన్ థియేటర్, పశువైద్యుడి గది తదితర నిర్మాణాలు చేస్తున్నారు. ఇవి పూర్తికాగానే యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నియమించిన రాజస్థాన్ ఏజెన్సీ టీం సభ్యులు జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏబీసీ నిర్మాణ పనులను, ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపి

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

గంగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి కుచ్చుటోపి పెట్టిన ఘటనపై శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం బండమీదజరావారిపల్లెకు చెందిన జ్ఞానేంద్రరెడ్డి అనే యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను తీసిస్తామని చెప్పి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు యువకులను నమ్మించాడు. కీలపట్లకు చెందిన మదన్‌మోహన్ రూ.1.50 లక్షలు చెల్లించాడు. వీరితోపాటు పలువురు యువకులు జ్ఞానేంద్రరెడ్డికి లక్షల రూపాయలు సమర్పించారు. ఇలా వసూలు చేసుకున్న జ్ఞానేంద్రెడ్డి.. బెంగళూరులో మరికొంతమంది యువకులతో కలసి ఆఫీసు సెటప్ చేశారు. ఇలా కొన్ని నెలలు గడిచినా టేబుల్స్ మాత్రమే ఉండగా.. కంప్యూటర్లు ఈరోజు వస్తాయి, రేపు వస్తాయి అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. అనుమానం వచ్చిన యువకులు జ్ఞానేంద్రరెడ్డిని గట్టిగా ప్రశ్నించడంతో మీ డబ్బు త్వరలోనే తిరిగి ఇచ్చేస్తానని 6 నెలల నుంచి ఏమార్చుతూ వస్తున్నాడు. ఇవ్వకపోగా తానిచ్చిన ఉద్యోగానికి మీరు రిజైన్ చేసినట్లు లెటర్ ఇస్తే డబ్బు ఇచ్చేస్తామంటూ చెప్పడంతో బాధితులు షాక్‌కు గురయ్యారు. మాకు ఎప్పుడు జాయినింగ్ లెటర్ ఇచ్చావు, ఏమని రిజైన్ చేయాలి అంటూ జ్ఞానేంద్రరెడ్డిపై ఎదురుతిరిగారు. సరైన సమాధానం రాకపోగా, పొంతనలేని మాటలు మాట్లాడడంతో, మదన్‌మోహన్‌తోపాటు బాధిత నిరుద్యోగులు గంగవరం పోలీసులను ఆశ్రయించారు.

అమ్మవారికి బంగారు వైజయంతిమాల కానుక



టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడు కుమార్తె తేజస్విని, మనవరాలు చైతన్య శుక్రవారం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి కానుకగా బంగారు వైజయంతి మాలను సమర్పించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌ను కలిసి దాతలు ఈ ఆభరణాన్ని అందజేశారు. కార్యక్రమంలోసూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ప్రాణదానం ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం



దాత తరపున విరాళం చెక్కును టీటీడీ అదనపు ఈవోకు అందజేస్తున్న సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.50 లక్షలు విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన బీఎంకె నగేష్ ఈ విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేయించారు. ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

చిత్తూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీపై ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్, టీటీసీ అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదని పేర్కొన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం, ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతాన్ని ప్రభుత్వం రిజర్వేషన్ కేటాయించిందని వివరించారు. రెండు నెలల శిక్షణ కాలంలో 75 శాతం హాజరైన వారికి నెలకు రూ.1,500 స్టైఫండ్‌తోపాటు మెటీరియల్స్‌కు రూ.వెయ్యి ఇస్తారని తెలియజేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు బ్యాంకు పాస్‌బుక్కు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి.. ఈనెల 20వ తేదీలోపు బీసీ సంక్షేమశాఖ కార్యాలయం, అంబేద్కర్ భవన్, కలెక్టరేట్ అనే చిరునామాలో అందించాలని కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఈనెలాఖరుకల్లా గోకులం షెడ్లను పూర్తి చేయాలి

శాంతిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నవంబరు చివరికల్లా గోకులం షెడ్లను పూర్తి చేయాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ అన్నారు. శుక్రవారం శాంతి పురం మండల పరిధిలోని 121పెద్దూరు, చెంగుబల్ల పంచాయతీలలోని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. సోగడబల్ల గ్రామానికి చెందిన నౌకత్‌అలీ, శెట్టిబల్ల గ్రామానికి చెందిన గురువారెడ్డి నిర్మించిన గోకులం షెడ్లను పరిశీలించారు. గోకులం షెడ్ల వల్ల పశువులు ఆరోగ్యకర వాతావరణంలో ఉండి పాలు దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అలాగే బెండనకుప్పం సమీపంలో ఉపాధి హామీ ద్వారా మోహన్‌రెడ్డి, శెట్టిబల్ల సుబ్రమణ్యం సాగు చేసిన రోజా పూల తోటలు, సోగడబల్ల గ్రామానికి చెందిన క్రమాన్ తాజ్ పొలంలో మామిడి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకం

కల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, పంచా యతీ కార్యదర్శులకు శిక్షణాతరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించేటప్పుడు రికార్డులు సక్రమంగా ఉంచాలన్నారు. సభకు హాజరైన సభ్యుల సంఖ్య, అజెండా, చర్చకు వచ్చిన అంశాలు, చర్చించి ఆమోదించిన అంశాలు తప్పనిసరిగా రికార్డు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ లకు 15 ఆర్థిక సంఘం నిధులు 75 నుంచి 85శాతం కేటాయించారన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు నాగరాజు, ప్రవీణ్‌కుమార్, లోకేష్, హరి పాల్గొన్నారు.

ప్రణాళికలతో గ్రామాభివృద్ధి సాధ్యం

సోమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు ముఖ్యమని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పంచాయతీలకు ఆదాయ వనరులు, నిధుల వినియోగంపై ఈవోపీర్డీ లక్ష్మీదేవి సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అమాన కుసుమ, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, అధికారులు హరిత, శివయ్య, దినకర్‌బాబు, వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

శాంతిపురం : శాంతిపురం మండల అభివృద్ధి ప్రణాళికపైన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్స్, వెలుగు ఎస్‌హెచ్‌జీ వీవో లీడర్లకు త్వరలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికను తయారు చేయడానికి ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు.

బోయకొండ ఆలయ చైర్మన్ పదవి బలిజలకు ఇవ్వాలి

పుంగనూరు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ పదవిని బలిజ కులస్థులకు ఇవ్వాలని ఆర్పీఎఫ్ జాతీయ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం బలిజ కులస్థులకు అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం బలిజలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు హేమంత్‌కుమార్‌రాయల్, శ్రీకాంత్‌రాయల్, నానబాల కుమార్‌రాయల్, జనార్ధన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

చౌడేపల్లె: నవంబరు15:(ఆంధ్రజ్యోతి) ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం వేదపండితులు చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద ఆశీర్వాద మండపం వద్ద కలశ స్థాపన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూల మంత్రన్ని భక్తులచే పఠింపజేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచ రింపజేశారు. రాహుకాలంలో అమ్మవారి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

పీఈఎస్‌లో ఐవీఎఫ్ చికిత్స విజయవంతం



కుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) ద్వారా గర్భిణీకి ఇటీవల శస్త్రచికిత్స చేసి విజయవంతంగా కాన్పు చేసినట్లు మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎస్‌కే.సుబ్రమణ్య తెలిపారు. పీఈఎస్ ఆస్పత్రిలోని తన ఛాంబర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తమ ఆస్పత్రిలో ఐవీఎఫ్ ద్వారా గర్భిణి అయిన సదరు మహిళకు ఈనెల 6వ తేదీన శస్త్ర చికిత్స ద్వారా కాన్పు చేశామని చెప్పారు. ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ఉష, డాక్టర్ విశాలి బృందం నేతృత్వంలో ఐయూఐ, డోనర్ ఐయూఐ, ఐవీఎఫ్ చికిత్సలను ఇప్పుడు పీఈఎస్ ఆస్పత్రిలో అతి తక్కువ ఖర్చుతో అందజేస్తున్నామన్నారు.

సీఎం దృష్టికి వి.కోట డిగ్రీ కళాశాల అంశం

వి.కోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వి.కోటకు గతంలో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు కోరారు. శుక్రవారం ఆయన అమరావతిలో సీఎంను కలిశారు. నిధుల విడుదలతోపాటు కళాశాలభవన నిర్మాణాలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వి.కోటకు తూర్పు వైపు బైపాస్ అంశాన్ని అయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు రాంబాబు, రామూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శివకుమారి తదితరులు ఉన్నారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు రూరల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని 108 సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రాముకు అందజేశారు. వారు మాట్లాడుతూ 108 వాహన సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలు పెంచాలని, పని గంటలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

పుంగనూరు రూరల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా తన పర్సులోని 100 గ్రాముల బంగారు వస్తువులు చోరీ అయినట్లు బాధితురాలు జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుంగనూరు మండలం పూజగానిపల్లెకు చెందిన జయమ్మ మదనపల్లె సమీపంలోని సీటీఎంకు వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో పుంగనూరు బయలుదేరింది. పూజగానిపల్లె వద్ద బస్సు దిగి ఇంటికి వెళ్లి చూడగా పర్స్ కనించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



వి.కోట నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం పంచాయతీ మద్దిరాళ్ళ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహిచారు. మాజీ సర్పంచ్ నాగభూషణమ్మ నేతృత్వంలో గ్రామస్తులు పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అలాగే బాబు దంపతులు స్కూల్‌కు కుర్చీలను వితరణగా అంద జేశారు. కార్యక్రమంలో ఎంఈవో మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

దోహా సదస్సుకు ద్రావిడ వర్సిటీ అధ్యాపకులు

గుడుపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి చెందిన తెలుగు అధ్యాపకులైన డాక్టర్ ఉదయకుమారి, డాక్టర్ పళనీలకు ఖతర్ దేశం దోహా నగరంలో జరిగే 9వ ప్రపంచ సాహితీ సదస్సుకు ఆహ్వానం అందినట్లు పీఆర్వో డాక్టర్ గణేష్ మూర్తి తెలిపారు. వీరు నవంబరు 22, 23వ తేదీల్లో జరిగే సాహితీ సదస్సుల్లో పత్రాలు సమర్పించునున్నటు తెలిపారు. వీరిద్దరిని వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ అభినందించారు.

అభివృద్ధి పనులు వేగంగా జరగాలి

వి.కోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):అన్ని పంచాయతీల్లోనూ అభివృద్ధి పనులు వేగవంతంగా జరగాలని అధికారులను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరన్, ఏపీవో అశోక్‌రెడ్డి, పీఆర్ ఏపీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

23న నీటి సంఘాల ఎన్నికలు

చౌడేపల్లె, నవంబర్15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 23న నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంఘ ఎన్నిక నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..చౌడేపల్లె మండలంలోని మహేశ్వర చెరువు, భగీరథ చెరువు, దేవమ్మ చెరువు, బోయకొండ గంగమ్మ, కోదండరామ చెరువు, మహత్రమ చెరువు, గంగమ్మ బుటకపల్లె చెరువు, చౌడేశ్వరి చెరువు, యలమ్మచెరువుల నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ కేవీఎస్ ప్రసాద్, ఏఈఈ భరత్, స్పెషల్ ఆఫీసర్స్, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

18న కనదాస జయంతి

కుప్పం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుప్పంలో కురబ కులదైవం కనకదాస జయంతిని ఈనెల 18వ తేదీన ఘనగా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్ అన్నారు. ఆయన జయంతిని విజయవంతం చేయాలని కురబ కులస్తులకు, ఇతర వర్గాలకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంనుంచి కురబ కులస్తులు ఆ పార్టీని ఆదరిస్తూ, ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కనదాస జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

బౌలింగ్‌లో దిలీప్‌కృష్ణకు జాతీయ గుర్తింపు



పలమనేరు, నవంబరు15 : పలమనేరులోని బాయ్స్ ఆఫ్ బాలు అకాడమీ నుంచి శిక్షణ పొందిన పలమనేరుకు చెందిన దిలీప్‌కృష్ణకు క్రికెట్ బౌలింగ్‌లో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని అకాడమీ కోచ్ బాలాజీ తెలిపారు. ఇండియా క్రికెట్ టీం మాజీ కోచ్ భరత్ అరుణ్ నేతృత్వంలో చెన్నైలో జాతీయ స్థాయిలో యువ క్రికెట్ బౌలింగ్ టాలెంట్ హంట్ నిర్వహించారని, 900 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 9 మంది మాత్రమే ఎంపికయ్యారని తెలిపారు. అందులో పలమనేరుకు చెందిన దిలీప్‌కృష కూడా ఉండటం గర్వకారణమన్నారు.

కార్తీక వనంలో పూజలు



పలమనేరు, నవంబరు15 : ప్రతి గ్రామంలో కార్తీక వనం పెంచుకోవాలని ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆయన తన పాఠశాల ఆవరణలో పెంచిన కార్తీక వనంలో చెట్లకు విద్యార్థులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో రావి, నెల్లి తదితర చెట్లకు పూజలు చేసి ఆ చెట్ల కింద భోజనాలు చేయాలని పెద్దలు సూచించారన్నారు.ఈ వృక్షాలనుంచి వెలువడే ఆక్సిజన్ మానవాళికి ఎంతో ఆరోగ్యకరమన్నారు.

పలమనేరులో ఎల్ఐసీ కళాజాత

పలమనేరు, నవంబరు15 : పలమనేరులో శుక్రవారం రాత్రి ఎల్ఐసీ కళాజాత బృందం నిర్వహించిన ప్రదర్శన పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సురెన్స్ యూనియన్ బెంగళూరులో నిర్వహించే 13వ మహాసభలకు ఈ కళాజాతా బృందం వెళ్తూ శుక్రవారం పలమనేరులోని గంగమ్మ గుడి ఆడిటోరియంలో ప్రదర్శనలిచ్చారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణ, ఉద్యోగుల తొలగింపుపైన ఈ కళాజాత బృందం ప్రదర్శనలు ఇచ్చారు. ప్రజలు చైతన్యవంతులై సంస్థను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.

బిర్సాముండాకు ఘన నివాళి




పలమనేరు, నవంబరు15 : పలమనేరు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు బిర్సాముండా జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ పట్టణ కన్వీనర్ తాతయ్యానాయుడు బిర్సముండా జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పలమనేరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రమాదేవి, బీజేపీ నాయకులు చంద్ర, ఆంజనేయులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

115 మందికి వైద్య పరీక్షలు

కల్లూరు,నవంబరు15(ఆంధ్రజ్యోతి):పులిచెర్లలో పారిశ్రామికవేత్త వారణాశి సామినిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బెంగుళూరు వైదేహి ఆసుపత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో క్యాన్సర్, గుండె, కిడ్నీ, బీపీ, షుగర్, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించగా 115మంది హాజరయ్యారు. కార్యక్రమంలో వారణాశి నచికేత్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, ధనంజయనాయుడు, నజీర్, ఎల్లారెడ్డి, చంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, శీను, రమణ, శిబిరం సమన్వయకర్త లోకేష్, వైద్యులు, చిత్తూరు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి) : పుదిపట్లలో వెలసిన వైష్ణవీ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు అమ్మవారికి పంచామృ తాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ ఆదర్శ డిపోగా కుప్పం

వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం



వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

కుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోను రాష్ట్రానికే ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతామని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో శుక్రవారం ఆయన కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రజా రవాణా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ సంస్థ పూర్తిగా విధ్వంసమైందన్నారు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై కక్ష వహించిన నాటి ప్రభుత్వం కుప్పం ఆర్టీసీ డిపోనుంచి పలు బస్సులను ఇతర డిపోలకు తరలించిందని, చాలా రూట్లలో బస్సు సర్వీసులు రద్దు చేసిందని విమర్శించారు. అయితే తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, కుప్పంనుంచి వెనక్కు వెళ్లిన బస్సులను తిరిగి రప్పించడమే కాక, పదుల సంఖ్యలో కొత్త సర్వీసులు వేశామన్నారు. రద్దయిన మార్గాలలోనే కాక, పలు కొత్త మార్గాలలో మారుమూల గ్రామాలకు సైతం బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. పలు ప్రాంతాలనుంచి కుప్పంలోని విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామన్నారు. ఇంకా ప్రజా రవాణాకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా చెబితే వాటిని తీరుస్తామని హామీ ఇచ్చారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ ఇప్పటికే తయారు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా చూపామన్నారు. విజన్ డాక్యుమెంట్‌లో పెట్టిన ప్రతిపాదనల ప్రకారం రాబోయే కాలంలో నియోకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్యార్థులు తమకు అనువైన వేళల్లో బస్సులు నడపాలని, బస్సులు లేని రూట్లకు వెంటనే సర్వీసులు వేయాలని విన్నవించారు. అలాగే కొందరు మారుమూల గ్రామాల ప్రజలు సైతం తమ గ్రామాల మీదుగా బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఈ సదస్సులో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మాజీ ఎంపీపీలు డాక్టర్ వెంకటేశ్, సాంబశివం, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించండి

గౌనివారి శ్రీనివాసులు



గ్రామసభలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం చిన్నారిదొడ్డి గ్రామ సచివాలయంలో నిర్వహించిన రెవిన్యూ గ్రామ సభకు ఆయన హాజరై రైతుల భూ సమస్యలపై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో చాలా తప్పులు చేశారని, దానివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే అనేక సార్లు కలెక్టర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారని అందులో లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయన్నారు. కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంగా ప్రజలు ఉన్నారని, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇంకా సమస్యలు పరిష్కారం కాకపోతే రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, పూర్తి అయిన తరువాత భూ సమస్యలు పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టీడీపీ నేతలు చలపతి, జయప్ప,శ్రీనివాసులురెడ్డి, శేఖర్, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

చల్లా రామచంద్రారెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న చల్లా బాబు

రొంపిచెర్ల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో రూ.80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల భవనాలకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మరుగుదొడ్లు పరిశీలించి శుభ్రతగా పెట్టాలని హెచ్ఎం సుజాతకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కూరల్లో పప్పు తక్కువగా వేశారని, పిల్లలకు భోజనం రుచికరంగా, నాణ్యతగా పెట్టాలన్నారు. తరగతి గదులకు వెళ్లి బోధనలు, సౌకర్యాలపై ఆరాతీశారు. వేడి నీటికోసం సోలార్ అమర్చాలని, ఆటస్థలంలో గుంతలేకుండా మట్టి తోలాలని ఉపాధ్యాయులు, పిల్లలు కోరారు. కార్యక్రమంలో ఈఈ బాలసుబ్బారావు, డీఈ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సర్పంచ్ ఆర్.ఇబ్రహీం ఖాన్, తహసిల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఈవోఆర్డీ సత్యంరెడ్డి, రాష్ట్ర కురబ కుల డైరెక్టర్ ఉయ్యాల రమణ, రామమూర్తి, రఫీ, కరీముల్లా, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో భక్తుల సందడి







మృత్యుంజయేశ్వరాలయంలో భక్తుల సందడి, ప్రత్యేక అలంకరణలో జ్ఞాన మల్లేశ్వర స్వామి, ఓంకారేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన

చౌడేపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవం సందర్భంగా శుక్రవారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. చౌడేపల్లె లోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు ధ్వజస్తంభం ముందు దీపాలు వెలిగించారు. సాయంత్రం ధ్వజస్తంభంపై అఖండ దీపాన్ని వెలిగించారు.

సోమల: మండలంలోని దుర్గంకొండ గార్గేయ మహర్షి ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేక పూజలు జరిపారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో అఖిలాండం ఏర్పాటు చేసి శివనామ సర్మణలతో సంకీర్తనలు ఆలపించారు. ఇరికిపెంట మధురమలై కొండలోని మల్లేశ్వరస్వామి, పేగలవారిపల్లె సోమేశ్వరాలయం, కందూరు అర్ధనారేశ్వరస్వామి, మల్లేశ్వరపురంలోని మల్లేశ్వరాలయాలు భక్తులతో సందడిగా మారాయి. సోమల బంగారు తిరుత్తణి కొండపై కార్తీక జ్యోతిని వెలిగించారు.

పుంగనూరు రూరల్ : పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని భోగనంజుండేశ్వరస్వామి, విరూపాక్షి మారెమ్మ, నెక్కుంది సమీపంలో వెలసిన ఆగస్తీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి దీపాలు వెలగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కోనేటి వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయం లో సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించి ఆయన కథను చదివి భక్తులకు వినిపించారు.

సదుం : సదుంలోని మల్లేశ్వరస్వామి, సదుంలోని మరకత శివలింగస్వామి, అరుణాచలేశ్వర, జంగంపల్లెలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. కోటి దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నదానం చేశారు. యర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని శివాలయంలోనూ దీపారాధన కార్యక్రమం జరిగింది.

రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగళ్లు, ఓంకారేశ్వరస్వామి, రొంపిచెర్ల కట్టకింద సిద్ధలింగేశ్వరస్వామి ఆలయాలకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. అర్చకులు అభిషేకాలు, బిర్వార్చనలు నిర్వహించారు.

రామకుప్పం : రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి,అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. గర్భాలయంలో కేదారేశ్వరీ అమ్మవారిని ప్రతిష్ఠించారు. పలు కుటుంబాల వారు సామూహిక కేదారేశ్వరి వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద కార్తీక దీపాన్ని వెలిగించారు. అమ్మవారు, స్వామి ఉత్సవర్లను మాఢ వీధులో ఊరేగించారు.

కల్లూరు : పులిచెర్ల మండలంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, జాంద్రపేట, కావేటిగారిపల్లి మల్లీశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. కల్లూరు చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం ముందు నిండు చంద్రుడి సమక్షంలో కార్తీకదీపం వెలిగించారు. ఒకవైపు నిండు చంద్రుడు, మరోవైపు కార్తీకదీపాన్ని దర్శించుకున్న భక్తులు ఒక్కసారిగా భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం ఆలయం ముందు జ్వాలాతోరణం నిర్వహించారు.

బైరెడ్డిపల్లె : స్థానిక శేషాద్రిస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించారు.

వి.కోట : వి.కోటలో వెలసిన కాశీవిశ్వేశ్వరాలయంలో స్వామికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

గుడుపల్లె : మల్లప్ప కొండలోని మల్లేశ్వరుడి, కాడేపల్లెలోని నాగనాగదీశ్వరుడి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. సాయంత్రం కొండపై దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు గిరి ప్రదర్శన చేసి ధ్వజస్తంభం వద్ద కొబ్బరి కాయలు కొట్టారు.



సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో..

గిరిజన పిల్లలందరూ బాగా చదవాలి : డీపీవో



ప్రసంగిస్తున్న డీపీవో పార్వతి

పలమనేరు, నవంబరు15 : గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించాలని, బడిఈడు పిల్లలు తప్పక పాఠశాలల్లో వుండాలని జిల్లా పంచాయితీ అధికారిణి పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరు మండలం జగమర్లలో నిర్వహించిన జన్ జాతీయ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం పలు సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. ఇళ్లపరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా వుంటారన్నారు. సారా, మద్యం వంటి మాదక ద్రవ్యాల వినియోగం చేయవద్దని సూచించారు. బాల్యవివాహాలు మానుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులు ప్రతి 15రోజులకొకసారి శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాదర్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం డీపీవో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజలు ఆరోగ్యవంతంగా వుండే విధంగా చర్యలు తీసుకొంటున్నామన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీ ఖాతాలకు జమచేశామన్నారు. ఈ నిధులను నిబంధనల మేరకు సర్పంచ్‌లు వినియోగించుకోవాలన్నారు.

ప్రయోగాత్మక బోధనతోనే గుణాత్మక విద్య: జేసీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మక బోధనతోనే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించగలమని జేసీ విద్యాధరి అన్నారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఎంఈవోలు, సీఆర్‌పీలకు టీచింగ్ అట్ రైట్ లెవెల్ (తరల్)పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జేసీ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు ప్రయోగాత్మక బోధన ఉపయోగపడుతుందన్నారు. 4,5 తరగతులకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా బృందాలుగా విభజించి వారికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ ఆటపాటలతో విద్యార్థులకు బోధనపై మక్కువ కలిగేలా ఉపాధ్యాయులు తగిన మెలకువలు పాటించాలన్నారు. అందరికి విద్య అందించాలనేదే పాఠశాల ఉద్దేశమని, 6-15 వయస్సు కలిగిన వారికి విద్యను నేర్పించడం బాధ్యత అని డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. అనంతరం ప్రథమ్ రాష్ట్ర నిర్వాహక సభ్యులు వినోద్ దీపక్, టీచింగ్ అట్ ది రైట్ లెవల్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఎస్ఎస్ఏఎంవో ఇంద్రాణి, ఎంఈవోలు, సీఆర్‌పీ, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు బిర్సా ముండా



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రప్రదేశ్): దేశంలో బ్రిటీష్ వలసవాద వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిటన గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా అని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు-2024 జరిగాయి. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్‌వాళ్లను ఎదిరించిన బిర్సా ముండాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు బిర్సా ముండా, అల్లూరి సీతారామారాజు, మల్లుదొర వంటివారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి మూర్తి, కార్యాలయ అధికారులు మురళి, ముత్తు, పూర్ణిమ, భాను, ప్రిన్సిపాల్ రేఖ, గిరిజన సంఘ నేతలు దేవరాజులు, సుబ్బరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండాకు ఘన నివాళి

చిత్తూరు కల్చరల్: స్వాతంత్ర సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సాముండాకు శుక్రవారం నెహ్రూయువ కేంద్రం అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. కేంద్రం అధికారులు ప్రదీప్‌కుమార్, బాబురెడ్డి మాట్లాడుతూ బిర్సా గిరిజనులకే కాదు నేటి యువతకు ఎంతో ఆదర్శమన్నారు. యువతకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు.

క్యాన్సర్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ క్వాలిటీగా చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి

చిత్తూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న క్యాన్సర్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ క్వాలిటీగా నిర్వహించాలని నోడల్ అధికారులను డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో నోడల్ అధికారులతో వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పై రెండు కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా సక్రమంగా నిర్వహిస్తే చికిత్సకు సులభతరం అవుతుందని చెప్పారు. ప్రతి డేటాను ఆన్‌లైన్‌లో క్వాలిటిగా నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీఐవో హనుమంతరావు, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పలువురి నివాళి



సంపత్ మృతదేహానికి నేతలతో కలిసి నివాళులు అర్పిస్తున్న చిట్టిబాబు నాయుడు, కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ మిట్టదళితవాడకు చెందిన జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి సంపత్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మరణించిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలుసుకుని పలువురు టీడీపీ నేతలు మిట్టదళితవాడలో శుక్రవారం ఉదయం సంపత్ మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నేతలు బాబు నాయుడు, జ్యోతీశ్వర్‌రెడ్డి, జ్యోతియాదవ్, లాయర్ శరణకుమార్, సురేంద్రబాబురెడ్డి, దీపక్ నాయుడు, దేవరాజులు, కోటి, లోకమ్మ, భువనేశ్వరి, మోహన్‌నాయుడు, పుష్పరాజ్, సుబ్బయ్య, చిదంబరం, పట్టాభి, గోపి, ప్రకాష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

యాదమరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, 104 వాహన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 70 కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన 104 వైద్యసేవలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా క్యాన్సర్ జబ్బుకు సంబంధించిన స్క్రీనింగ్‌ను ప్రారంభించిందని, ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రనాథరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గాప్రసన్న, మహిళా ఆరోగ్య కార్యకర్త గజలక్ష్మి, 104 డీఈవో రవికుమార్, ఆశాకార్యకర్తలు నీలా, సురేఖ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన పోస్టర్లు, బ్యానర్లు పెట్టొద్దు



సినిమా థియేటర్ల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇష్టారాజ్యంగా సినిమా పోస్టర్లు, బ్యానర్లు పెట్టవద్దని కమిషనర్ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక కార్యాలయంలో సినిమా థియేటర్ల యజమానులు, ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇష్టారీతిగా పోస్టర్లు, బ్యానర్లు పెట్టడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలగడంతో పాటు స్వచ్ఛతా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేయకూడదన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ప్రణాళికా విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్రాయకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేసి విశేష అలంకారంలో ప్రత్యేక రథంపై అధిష్ఠింపజేసి సీటీ రోడ్డు, దర్గా, పలమనేరు రోడ్డు, ఎంఎస్ఆర్ జంక్షన్, వేలూరు రోడ్డు, గిరింపేటలో గిరి ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ ధర్మకర్త పూల సుబ్రమణ్యం నాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం

పెనుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి పుస్తక పఠనం ఎంతో అవసరమని పెనుమూరు గ్రంథాలయ అధికారి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో ఉచిత పుస్తక పఠనం ఏర్పాటు చేశారు. 30 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రంథాలయాధికారి మునిరాజ తెలిపారు. శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పచ్చికాపల్లంలో పుస్తక ప్రదర్శన చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



చిత్తూరు అగస్త్యీశ్వరాలయంలో దీపారాధనలు చేస్తున్న భక్తులు - అర్ధగిరిలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు - ప్రత్యేక అలంకరణలో బాలగురునాధీశ్వరస్వామి - మొగిలీశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు - మొగిలీశ్వరస్వామికి అన్నాభిషేకం

చిత్తూరు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలను భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కామాక్షి అంబికా సమేత అగస్త్యీశ్వరాలయంలో భక్తులు పార్వతి పరమేశ్వరుల సంకల్పసిద్ధి పూజలు, దీపారాధనలు చేశారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరాలయంలో అన్నాభిషేకం, హోమాలు నిర్వహించగా, భక్తులు దీపారాధనలు చేశారు. గిరింపేట దుర్గాంబ, సంతపేట కనకదుర్గా ఆలయాల్లో పూజలు, అన్నదానం చేశారు. కాశీ విశ్వేశ్వరా (రాజుగుడి), కట్టమంచి కులందేశ్వర, ఇరువారం నాగేంద్ర స్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు జరిగాయి. ఆలయాల నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి, భక్తులకు దర్శనం గావించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పాలసముద్రం: శ్రీబొమ్మరాజుపురంలో ఉన్న బాలగురునాధీశ్వర ఆలయంలో రుద్రాభిషేకం, పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు కలశాలు ఏర్పాటుచేసి రుద్రాభిషేక హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతకు, మూలవిరాట్‌లోని బాలగురునాధీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలుచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బంగారుపాళ్యం: మొగిలిలో వెలసిన కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామికి అన్నాభిషేకం చేశారు. స్వామివారిని అన్నంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దేవరకొండలో ఉన్న జలకంఠేశ్వరుడికి ప్రత్యేకపూజలు చేసి దీపారాధనలు చేశారు.

పెనుమూరు: మండలంలోని పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీ పరమేశ్వరుల ఆలయంలో భక్తులు ఆలయంలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పలు అభిషేకాలతో పుష్పాలంకరణచేసి భక్తులకు దర్శన భాభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, ఠాణావేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణ నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరువీధి ఉత్సవం, కార్తీక దీపం ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఉద్యోగులు హాజరయ్యారు. కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం పూజలు, కుంకుమార్చన, రాహుకాలం పూజలు చేశారు.

● వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కుంకుమార్చన చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

యాదమరి: మండల కేంద్రంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్థానిక శివాలయంలో అభిషేకం చేసి స్వామి వారిని ధర్మస్థల మంజునాథేశ్వరుడి రూపంలో కొలువుతీర్చారు. మహిళలు రావిచెట్టు కింద నాగలకట్టకు దీపారాధన చేశారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పుష్పాలంకరణ చేసి సప్పరంలో ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



పులిగుండు శివాలయంలో దీపాలు వెలిగించిన దృశ్యం - వెదురుకుప్పం మండలం చవటగుంటలో కుంకుమార్చన - కార్వేటినగరంలో సదాశివేశ్వరస్వామి

బాధ్యతలు స్వీకరించిన ఆపరేషన్స్ ఏఎస్పీ



ఎస్పీని కలిసిన ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఏఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈయన చిత్తూరు జిల్లా ఆపరేషన్స్ ఏఎస్పీగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ మణికంఠ చందోలును మర్యాదపూర్వకంగా కలిశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వెదురుకుప్పం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమకు అందిన రహస్య సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం రాత్రి తెలిపారు. మండలంలోని కురివికుప్పం అటవీప్రాంతంలో జూదం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడి జరిపినట్లు చెప్పారు. ఈ క్రమంలో జూదరులు మధు, చిరంజీవి, ముని, రమేష్, మోహన్, మునికృష్ణలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4700 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

సారా విక్రేత అరెస్టు

వెదురుకుప్పం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె కాలనీకి చెందిన శంకరయ్య సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి, శంకరయ్యను రిమాండుకు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆదుకోవడానికే అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం మండల టీడీపీ సీనియర్ నాయకుడు మురళీ నాయుడు జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుమతి, టీడీపీ నాయకులు పళని, కార్తీక్, జ్యోతి, రవి నాయుడు, బోడెబ్బ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికల అధికారులకు శిక్షణ

నగరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ మధుకుమార్, ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ చెరువుకింద ఆయకట్టు భూమి కలిగి వున్న రైతులకు ఓటుహక్కు కల్పించి, సాగునీటి సంఘాల ఎన్నికలు ఎలా జరపాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎన్నికల అధికారులకు వివరించారు.

పాలసముద్రం: సాగునీటి సంఘాల ఎన్నికలపై టీచర్లు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో కృష్ణ మహేష్‌రెడ్డి, ఈవీఆర్‌డీ రమేష్, ఏఈలు చీరాలయ్య, వరదరాజులు, ఎంఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



తవణంపల్లెలో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో జుబేదా

తవణంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జుబేదా అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్పీ డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను పరిరక్షింపబడే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు తయారు చేసి మొదట గ్రామసభలో సంకల్పం తీసుకొని రెండవ గ్రామసభలో ప్రణాళికలపై ఆమోదం తీసుకొని గ్రామ స్వరాజ్ పోస్టల్‌లో అప్లోడ్ చేయడంతో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో రెడ్డిబాబు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు ఎంపీడీవో మీటింగ్ హాలులో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ అబ్బూ అనిత, ఎంపీడీవో మారం హరిప్రసాద్‌రెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై సమావేశం నిర్వహించారు. ఎంపీపీ లత, ఎంపీడీవో టి.చంద్రమౌళి, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

● వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ నాగరాణి, ఎంపీడీవో అమరనాథ్, ఈవోపీఆర్డీ పురుషోత్తం తదితరులు హాజరయ్యారు.

రాష్ట్ర ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



జీవిరెడ్డిని సన్మానిస్తున్న భానుప్రకాష్

నగరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ జీవిరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి శుక్రవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం జీవిరెడ్డిని ఎమ్మెల్యే శాలువా, పుష్ప గుచ్ఛంతో సన్మానించారు.

చిత్తూరుకు నీరు రావడం గర్వకారణం



ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

గుడిపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నీరు రప్పించడం సంతోషదాయకమని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కృషితో నీరు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవి నాయుడు, బాబు రెడ్డి, శంకర్ చౌదరి, ఐజాక్, విల్సన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం



సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేస్తున్న అభిమానులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్, నటశేఖర కృష్ణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కన్నయ్య నాయుడు కాలనీ సమీపంలోని బృందావనంలో ఆయన అభిమానులు వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ అభిమానులు కె.ఎస్.రవికుమార్, రాజేంద్ర, రావూరి రవిబాబు, హుస్సేన్, దీన, ప్రతాప్, సురేష్, అర్జున్, ముని, రాజు, బద్రి, బాబు, ప్రసాద్, లోకేష్‌లు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ

విజయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు శుక్రవారం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కోసలనగరంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, ఇళ్ళత్తూరులో సీనియర్ టీడీపీ నేత మునిభాస్కర్‌రాజు, క్షూరికాపురంలో సర్పంచ్ శేఖర్ తదితరులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్‌రాజు, బాషా, ఏలుమలై, వరదరాజులు, కోదండరాజు, బాలాజీ నాయుడు, శ్యాంసుందర్, శివయ్య నాయుడు, యుగంధరరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు 1998 ఎంటీఎస్ టీచర్ల సమావేశం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉదయం 11 గంటలకు 1998 క్వాలిఫైడ్ టీచర్స్ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిమం టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్న నేపథ్యంలో 1998 ఎంటీఎస్ టీచర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి నెల్లూరు జిల్లా కమ్మపాళ్యంకు చెందిన రజనీకాంత్ శుక్రవారం రూ.1,00,116 చెక్కు రూపంలో అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



పవిత్రమాలలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

నగరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలో గల కరియ మాణిక్యస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. రెండవరోజైన శుక్రవారం శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీటితో అభిషేకం నిర్వహించారు. పవిత్రమాలలను ఆలయ ప్రదక్షిణ చేసి పరివార దేవతలకు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ధ్వజస్తంభ పీఠానికి పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం 7గంటలకు గ్రామోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను ఆలయప్రాంగణంలో ఊరేగించారు. యాగశాలలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల ఏఈవో రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి వెంకటరమణ, గుణశేఖర్, ప్రధాన అర్చకులు నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి అబ్దుల్ కలాం అవార్డు



హెచ్‌ఎం గంగాధరంను సన్మానిస్తున్న సోమలరాజు ఫౌండేషన్ నిర్వాహకులు

గంగాధరనెల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పంచాయతీ అక్కనగారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల పీఆర్‌టీయు గౌరవ అధ్యక్షుడు ఆర్.గంగాధరంకు అబ్దుల్‌కలాం అవార్డు లభించింది. గంగాధరం చేసిన సామాజిక సేవలను గుర్తించిన సోమలరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పీసీఆర్ గ్రాండ్‌లో గురువారం శాలువా, మెమొంటోతో సత్కరించి, అబ్దుల్ కలాం అవార్డు అందజేశారు.

జిల్లా వాలీబాల్ జట్టుకు విద్యార్థి

వెదురుకుప్పం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జీఎంయూపీఎస్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న పి.బ్లెస్సింగ్ అనే విద్యార్థి జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, మనోజ్‌కుమార్, హెచ్‌ఎం నాగరాజు శుక్రవారం తెలిపారు. ఆ విద్యార్థికి అభినందనలు తెలిపారు.

వైభవంగా పడిగట్ల పూజ

గుడిపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుముందరవూరులో శుక్రవారం అయ్యప్ప పడిగట్ల పూజలో భాగంగా భక్తులు అరటి పట్టలతో అలంకరించి, భక్తిపాటలతో భక్తులను మైమరిపించారు. అనంతరం పడిగట్ల పాట పాడి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.